# ప్రజా మశాల

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 07 | సంచిక : 25 | ఆదివారం 20 - 09 - 2026 | పేజిలు : 04 | వెల రూ. 2




తెలంగాణలో మళ్లీ వానలు,
24 వరకు భారీ వర్షాలు



## వైఎస్, కేసీఆర్ పార్టీ ఫిరాయింపులను విపరీతంగా ప్రోత్సహించారు

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెంపపెట్టు అన్న కిషన్ రెడ్డి
- గతంలో సబిత, తలసాని రాజీనామా చేయకుండానే కేసీఆర్ వారికి మంత్రి పదవులు కట్టబెట్టారని మండిపాటు
- భూదందాలు, అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీపడుతున్నాయని విమర్శ

**హైదరాబాద్ :**
ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ - మిగతా 2 లో

### వరంగల్ కొత్త ఎయిర్‌పోర్టుకు

# పేరు సూచించండి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- వరంగల్ మామునూరులో రానున్న కొత్త ఎయిర్‌పోర్టుకు ఏం పేరు పెట్టాలో సూచించాలని రేవంత్‌రెడ్డి కోరారు
- ప్రాజెక్టును పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శ
- భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఏఏఐకి భూమి అప్పగింత
- మూడు ప్యాకేజీలుగా పనులు, డిసెంబర్‌లో శంకుస్థాపన చేసేందుకు ప్రణాళిక



**హైదరాబాద్ :**
వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతుల దగ్గర నుంచి భూసేకరణ, సాంకేతిక పరమైన పరిశీలన దశలను దాటుకొని నిర్మాణ పనులను 3 ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే 2 ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే. మామునూరులో రానున్న కొత్త ఎయిర్‌పోర్టుకు ఏం పేరు పెట్టాలో సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి విమానాశ్రయం కల సాకారం కాబోతోందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటు కోసం చురుగ్గా జరుగుతున్న ప్రక్రియలపై పత్రికల్లో వచ్చిన కథనాలను ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ వరంగల్ విమానాశ్రయం కలను నిజం చేయలేకపోయిందన్న రేవంత్ రెడ్డి ఆ పార్టీ నాయకులు కేవలం తమ కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి పెట్టారని వ్యాఖ్యానించారు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇప్పుడు వరంగల్ ఎయిర్‌పోర్ట్ కల సాకారం అవుతోందని స్పష్టం చేశారు. మామునూరు విమానాశ్రయం భూసేకరణ కోసం - మిగతా 2 లో

### ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు

## ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు



- మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు
- శ్రీశైలం నుంచి 84 టీఎంసీలు వాడామన్నది పచ్చి అబద్ధం
- గత మూడేళ్లలో ఏపీ 718, తెలంగాణ కేవలం 216 టీఎంసీలే వాడిందన్న హరీశ్ రావు
- రాష్ట్ర చరిత్రలోనే ఈ ఏడాది అత్యల్పంగా కృష్ణా జలాల వినియోగం
- నీళ్లు, మోటార్లు ఉన్నా ప్రభుత్వం వాడుకోలేకపోయిందని విమర్శ

**హైదరాబాద్ :**
మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చినవి కావని - మిగతా 2 లో

## అట్టహాసంగా ఆసియా క్రీడలు ప్రారంభం

- భారత పతాకధారులుగా పవన్ సెహ్రావత్, మను భాకర్
- జపాన్‌లో నేటి నుంచి 2026 ఆసియా క్రీడలు
- భారత పతాకధారులుగా కబడ్డీ ప్లేయర్ పవన్, షూటర్ మను భాకర్
- తాజిందర్‌పాల్ స్థానంలో అనూహ్యంగా పవన్‌కు దక్కిన అవకాశం
- ఈ క్రీడల్లో 36 క్రీడాంశాల్లో 503 మంది భారత అథ్లెట్ల పోటీ
- గత రికార్డును అధిగమించడమే లక్ష్యంగా బరిలోకి భారత్

**ఢిల్లీ :**
జపాన్‌లోని ఐచి-నగోయాలో 20వ ఆసియా క్రీడలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పాలోమా మిజుహో స్టేడియంలో జరిగిన ఆరంభ వేడుకల్లో భారత బృందానికి పతాకధారులుగా కబడ్డీ ప్లేయర్ పవన్ సెహ్రావత్, ఒలింపిక్ పతక విజేత మను భాకర్ - మిగతా 2 లో



### 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో

## యువతకు కొత్త అవకాశాలు'



- రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ
- 20వ రోజ్‌గార్ మేళాలో 51 వేలకు పైగా నియామక పత్రాల పంపిణీ
- దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన ఉద్యోగ మేళా
- భారత్ ఇప్పటివరకు వివిధ దేశాలతో 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంది

**ఢిల్లీ :**
2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తోందని, ఇందులో యువత పాత్ర చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) దేశ యువతకు కొత్త కెరీర్ అవకాశాలకు మార్గం సుగమం చేస్తున్నాయని అన్నారు. కొత్త మార్కెట్లకు భారత వ్యాపారులు చేరుకోవడంతో పాటు, యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాల ఆధారంగా కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో వీడియో కాన్ఫరెన్స్ - మిగతా 2 లో

### స్థానిక ఎన్నికల్లో

## కూటమిదే విజయం


2 లో

- ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్
- 100 శాతం స్ట్రైక్ రేట్ ఖాయమన్న మంత్రి నాదెండ్ల
- కచ్చితంగా విజయం సాధించే స్థానాల్లో పోటీ చేయడమే ముఖ్యమని వ్యాఖ్య
- పవన్ కల్యాణ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నారని వెల్లడి

### అనర్హత తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన

# దానం నాగేందర్



- హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్
- తన అనర్హతను సవాల్ చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరపున పోటీ చేయడమే కారణం
- ఇప్పటికే సుప్రీంలో కేవియట్ దాఖలు చేసిన ఇతర ఎమ్మెల్యేలు

**హైదరాబాద్ :**
ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. బీఆర్ఎస్ తరపున గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై శుక్రవారం హైకోర్టు అనర్హత వేటు వేసిన విషయం విదితమే. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. ఈ అనర్హత 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే వర్తిస్తుందని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ గతంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా - మిగతా 2 లో



## కరవులో రైతాంగం.. దోపిడీలో కూటమి ప్రభుత్వం

- వైసీపీ సీనియర్ నాయకుడు పేర్ని నాని
- తప్పుడు హామీలతో ప్రజలను నమ్మించి కూటమి అధికారంలోకి వచ్చిందంటూ పేర్ని నాని ధ్వజం
- సూపర్ సిక్స్ హామీలు ప్రకటనలకే పరిమితం అయ్యాయని విమర్శ
- ప్రజల నుంచి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరిక

**అమరావతి :**
అధికార పీఠం ఎక్కేందుకు ఊహాజనిత హామీలతో ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను పూర్తిగా పక్కనబెట్టేసిందని కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నాయకుడు పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీరు అందక, సరైన ప్రణాళికలు లేక కరవు కోరల్లో చిక్కుకుని రైతాంగం అల్లాడిపోతుంటే... కూటమి నాయకులు మాత్రం పాలనను గాలికి - మిగతా 2 లో

### నా జీవితం ధన్యమైంది

## విశాఖలో చంద్రబాబు ఎమోషనల్



- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- లబ్ధిదారులకు స్వయంగా పట్టాలు అందించి సుభాకాంక్షలు తెలియజేశారు
- పేదలకు వారి ఇంటిపై శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలను అందించిన సీఎం చంద్రబాబు
- విశాఖలో 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- మీ ఇంటిపై సర్వ హక్కులు మీవేనని సీఎం చంద్రబాబు భరోసా
- విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని భారీ ప్రకటన

**అమరావతి :**
కూడు, గూడు, గుడ్డ అనే ఎన్టీఆర్ నినాదాన్నే తాము విధానంగా మార్చుకుని పేదలందరికీ నివాస వసతి కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న 28 వేలకుపైగా పేదలకు వారి ఇంటిపై శాశ్వత హక్కు కల్పిస్తూ - మిగతా 2 లో

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని

# 513 మండలాల్లో కరవు

- అధికారుల ప్రాథమిక అంచనా
- వర్షాభావ పరిస్థితులపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు
- ఎక్కడా పంట నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు
- పంట నష్టాన్ని నివారించి, సూక్ష్మ సేద్యం, ప్రకృతి సాగును ప్రోత్సహించాలని సూచన
- తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, విశాఖపై ప్రత్యేక కార్యాచరణకు ఆదేశం
- ఎల్‌నినో ప్రభావంతో ఉద్యాన పంటల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశం



**అమరావతి :**
ఏపీలో 513 మండలాల్లో కరవు ఛాయలు అలుముకోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి హై అలర్ట్ ప్రకటించారు. రైతు పంటకు భరోసా, ప్రజలకు నీటి భద్రతే లక్ష్యంగా సీఎం ముందస్తు యాక్షన్ ప్లాన్‌కు దిశానిర్దేశం చేశారు. వర్షాభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి అక్టోబర్ 1న కరవు మండలాలను ప్రకటించాలని ఆదేశించారు. పంట నష్టం రాకుండా ఇప్పటి నుంచే చర్యలు మొదలు పెట్టాలని, సూక్ష్మ సేద్యం, ప్రకృతి సాగును ప్రోత్సహించాలని తాగునీటి ఎద్దడి రాకుండా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ మేరకు అమరావతిలోని ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు రాష్ట్రంలో నెలకొన్న కరవు ముప్పుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఏపీ వ్యాప్తంగా - మిగతా 2 లో

# సంపాదకీయం

## మణిపూర్‌ను చక్కదిద్దలేరా!

గత మూడేళ్లుగా అనుచిత కారణాలవల్లే ఎప్పుడూ వార్తల్లో ఉంటున్న మణిపూర్ మళ్లీ ప్రతీకారేచ్ఛతో రగులుతోంది. 2023 మేలో మొదలైన జాతుల ఘర్షణలు ఎప్పుడూ పెద్దగా ఆగిందేమీ లేదుగానీ... మీడియాలో ప్రముఖంగా వచ్చేంత పెద్ద సంఘటనలు జరగలేదు. కానీ ఆ స్వల్పకాల నిశ్శబ్దం కాస్తా గత ఆదివారం బద్దలైంది. ఆ రోజు తమెంగ్లాంగ్ జిల్లాలోని టోలెన్ గ్రామంలో వేకువజామున ఒక మహిళతో సహా నలుగుర్నిదుండగులు కాల్చిచంపారు. అటుతర్వాత సాయంకాలం అదే జిల్లాలో లోంగ్పి అనే గ్రామంలో ఒక యువకుణ్ణి, మహిళను కాల్చిచంపారు.మొదటి దాడి కుకీ ప్రాబల్య గ్రామంలో నాగాలే లక్ష్యంగా జరిగితే, రెండో దాడి నాగాలు మెజారిటీగావున్నచోట కుకీలపై జరిగింది. 1992--97 మధ్య కుకీ--నాగాల ఘర్షణల్లో బలైనవారి స్మారకార్థం ఆదివారం కుకీలు 'బ్లాక్ డే' పాటించిన రోజునే ఈ రెండు దాడులూ చోటుచేసుకోవడం గమనించదగింది. మణిపూర్ పలు జాతులకు నిలయం. ఇన్ని దశాబ్దాల పాలనలో భిన్న రాజకీయపక్షాల నాయకులు గద్దెనెక్కినా, ఏ ఒక్కరూ ఆ జాతులమధ్య సామరస్య వాతావరణాన్ని నెలకొల్పలేకపోయారు.2023 నాటి ఘర్షణల సమయంలో అప్పటి బీజేపీ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ప్రధాన తెగలైన మెయితీ--కుకీల మధ్య పరస్పర హననం సాగుతుంటే, దాన్ని భద్రతా బలగాలకూ, కుకీ మిలిటెంట్లకూ మధ్య సాగుతున్న ఘర్షణగా చిత్రించే యత్నం చేశారు. చివరకు భద్రతా బలగాలే బీరేన్ సింగ్ ప్రకటనను ఖండించాల్సి వచ్చింది. ఆ ఘర్షణల్లో దాదాపు 300 మంది మరణించగా, 60,000 మంది నిరాశ్రయులయ్యారు. ఇప్పటికీ వారిలో చాలా మంది సహాయ శిబిరాల్లోనే బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వస్తోంది.కొందరు ఇప్పుడిప్పుడే గ్రామాలకు వెళ్తున్న తరుణంలో మళ్లీ హింస చెలరేగింది. మెయితీల ఆధిక్యతగల ఇంఫాల్ లోయలో 2023లో వారివైపు నుంచి హింస మొదలైనప్పుడు అదుపు చేయగలిగి ఉంటే సమీప కొండ ప్రాంతాల్లోని కుకీలు రెచ్చిపోయేవారు కాదు. అయితే మూడేళ్లనాటి హింసకూ, ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి సాగుతున్న హింసకూ మౌలికంగా వ్యత్యాసం ఉంది. అప్పట్లో వందలమంది గుంపులుగా ఊళ్లపైబడి దాడులు చేశారు. ఇళ్లకు నిప్పంటించటం, మహిళలపై అత్యాచారాలకు పాల్పడటంవంటివి చోటు చేసుకున్నాయి.కానీ ఇప్పుడు చడీచప్పుడూ లేకుండా వచ్చి దాడులు చేసి పోతున్నారు. అలాగే మొన్నటివరకూ ప్రధానంగా మెయితీ--కుకీ తెగలమధ్యే ఘర్షణలుండగా, మూడు దశాబ్దాల క్రితం నాటి ఉదంతాలను గుర్తు తెస్తూ ఇప్పుడు కుకీ--నాగా జాతులమధ్య వైరం సాగుతోంది. మెయితీలు తమను సైతం గిరిజనులుగా గుర్తించాలని డిమాండ్ చేయగా, దాన్ని కుకీలు వ్యతిరేకించారు. ఇప్పుడు కుకీలు, నాగాలూ క్రైస్తవులే అయినా వారిమధ్య భూమి విషయంలో కొట్లాటలు సాగుతున్నాయి. బీరేన్ సింగ్ ప్రభుత్వం పోయి, కొన్నాళ్లు రాష్ట్రపతి పాలన కొనసాగి మొన్న ఫిబ్రవరిలో ఖేమ్‌చంద్ సింగ్ ఆధ్వర్యంలో కొత్త సర్కారు ఏర్పడింది.నిండా రెండునెలలు కూడా ప్రశాంతత లేకుండా నాగా--కుకీలమధ్య ఘర్షణలు మొదలయ్యాయి. ఒక మహిళపై అత్యాచారం కూడా చోటుచేసుకుంది. ఇవన్నీ సహాయ శిబిరాల్లో జరిగినవే. ఈ ఉదంతాలపై సమగ్ర నివేదిక కావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం గురువారం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మరణాలపై లోగడే సర్వోన్నత న్యాయస్థానం త్రిసభ్య సంఘాన్ని నియమించగా, ఆ సంఘం 25 అసహజ మరణాలను ప్రస్తావించింది.వీటిపై జూన్ 11నుంచి వివరణ కోరుతున్నా, ఇంతవరకూ జవాబులేదని ఆ సంఘం చెప్పటంపై ధర్మాసనం దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది.మృతుల వారసులకు అరకొర ఆర్థికసాయం అందించటంపైనా నిలదీసింది. మొత్తంగా 8 జిల్లాల్లోని శిబిరాల్లో 640 మంది మరణించగా, అందులో 34 మంది మరణాలు అసహజమైనవని తేలింది. కానీ 25 మృతదేహాలకు మాత్రమే పోస్టుమార్టం జరిపించారు. ఈ వరస చూస్తుంటే పాలకులు మారినా మారిందేమీ లేదని అర్థమవుతోంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రాలు సమగ్రంగా చర్చించుకుని తగిన కార్యాచరణకు దిగనట్టయితే అక్కడ శాంతిభద్రతలు మరింత క్షీణించటం ఖాయం.

## అనర్హత తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్

మొదటిపేజీ తరువాయి - పరిగణించాలని, తీర్పు ప్రతులను స్పీకర్ కార్యాలయానికి, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశాలు జారీ చేసింది.మరోవైపు, ఇదే వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అంశంపై తమ వాదనలు వినకుండా ఎలాంటి ఏకపక్ష నిర్ణయం తీసుకోవద్దని వారు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

## వైఎస్, కేసీఆర్ పార్టీ ఫిరాయింపులను విపరీతంగా ప్రోత్సహించారు

మొదటిపేజీ తరువాయి - పార్టీలకు చెంపపెట్టు అని కేంద్ర మంత్రికిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు హైదరాబాదులో మీడియాతో మాట్లాడిన ఆయన... ఉమ్మడి ఏపీలో వైఎస్ రాజశేఖరరెడ్డి, తెలంగాణలో కేసీఆర్ ప్రజాస్వామ్య సూత్రాలను పక్కనబెట్టి ఫిరాయింపులను విపరీతంగా ప్రోత్సహించారని ఆరోపించారు. గతంలో సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండానే మంత్రి పదవులు కట్టబెట్టారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే దానం నాగేందర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారని, బీజేపీ శ్రేణులు జరిపిన నిరంతర న్యాయపోరాటం వల్లే ఆయనపై అనర్హత వేటు ముప్పు వచ్చిందని స్పష్టం చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండూ భూదందాలు, అవినీతిలోనే పోటీపడుతున్నాయని... 'దోచుకోవడం-దాచుకోవడం' తప్ప ప్రజాక్షేమం పట్టడం లేదని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలనపై అనేక అవినీతి ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పటివరకు వారిపై ఏలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా 'మ్యాచ్ ఫిక్సింగ్' రాజకీయాలు నడుపుతున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇరు పార్టీలు పరస్పరం నాటకాలు ఆడుతున్నాయని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఏ ప్రాతిపదికన ఇచ్చారో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే ఏ ఎన్నికలకైనా బీజేపీ సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు.

## స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం

మొదటిపేజీ తరువాయి - రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగిస్తుందని, వందకు వంద శాతం స్ట్రైక్ రేట్‌తో విజయాలు సాధిస్తామని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ధీమా వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో ఈరోజు పర్యటించిన ఆయన పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమై మాట్లాడారు. అభ్యర్థుల ఎంపికలో ఏవైనా పొరపాట్లు లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ, స్థానిక వార్డుల వారీగా బలమైన నాయకత్వాన్ని సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ని సీట్లలో పోటీ చేస్తున్నామనే సంఖ్య కంటే, గెలిచే బలం ఉన్న స్థానాల్లో నిలబడి కచ్చితమైన విజయం సాధించడమే ప్రాధాన్యమని స్పష్టం చేశారు.జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇవాళ్టి నుంచి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రానున్నారని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రాజకీయాల్లో అనుభవమే అసలైన పాఠమని పేర్కొంటూ, జీవీఎంసీ పరిధిలో గతంలో గెలిచిన, రెండో స్థానంలో నిలిచిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.కేవలం టికెట్ వస్తే సరిపోదని... ప్రజల అవసరాలు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం కేడర్ నిరంతరం శ్రమించాలని నిర్దేశించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఐక్యత వల్లే రాష్ట్రంలో పెట్టుబడిదారులకు కొండంత భరోసా లభించిందని, ఉత్తరాంధ్రకు వస్తున్న భారీ ప్రాజెక్టులే దీనికి నిదర్శనమని చెప్పారు. జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజల ప్రయోజనాల కోసమే పనిచేస్తుందని తెలిపారు.

## అట్టహాసంగా ఆసియా క్రీడలు ప్రారంభం




మొదటిపేజీ తరువాయి - వ్యవహరించారు. వీరిద్దరూ త్రివర్ణ పతాకాన్ని చేతబూని భారత బృందాన్ని ముందుండి నడిపించారు.ఈ మెగా ఈవెంట్‌లో భారత్ తరఫున 36 క్రీడల్లో 503 మంది అథ్లెట్లు పోటీ పడుతున్నారు. వాస్తవానికి పురుషుల విభాగంలో ఫ్లాగ్ బేరర్‌గా షాట్‌పుటర్ తాజింద ర్‌పాల్ సింగ్ తూర్‌ను ఎంపిక చేశారు. అయితే, అతడికి సంబంధించిన సెరిమోనియల్ కిట్ సకాలంలో అందకపోవడంతో వేడుకకు హాజరు కాలేకపోయాడు.దీంతో అతడి స్థానంలో పవన్ సెహ్రావత్‌కు ఈ గౌరవం దక్కింది. గత ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత కబడ్డీ జట్టులో పవన్ సభ్యుడిగా ఉన్నాడు. మహిళల విభాగంలో పతాకధారిగా వ్యవహరించిన మను భాకర్, పారిస్ 2024 ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించింది.స్వతంత్ర భారత చరిత్రలో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన తొలి అథ్లెట్‌గా ఆమె రికార్డు సృష్టించింది. ఈ క్రీడల్లో ఆమె 10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల పిస్టల్, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లలో పోటీపడనుంది.గతంలో హాంగ్‌జౌ 2022 ఆసియా క్రీడల్లో 107 పతకాలతో రికార్డు సృష్టించిన భారత్, ఈసారి ఆ ప్రదర్శనను అధిగమించి మరిన్ని పతకాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 513 మండలాల్లో కరవు

మొదటిపేజీ తరువాయి - కరవు ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రైతులు, ప్రజలకు ఇబ్బందులు రాకుండా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరులు, వ్యవసాయ రంగంపై సమగ్ర కార్యాచరణ కొనసాగించాలని ఆయన స్పష్టం చేశారు.నీటి లభ్యత తగ్గుతున్న పరిస్థితుల్లో రైతులకు అందుబాటులో ఉన్న సాంకేతిక సేవలపై చంద్రబాబు అధికారులతో చర్చించారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణాన్ని కాపాడేలా మైక్రో ఇరిగేషన్‌ను విస్తృతంగా అమలు చేయాలని ఆదేశించారు. అన్నదాతలను సూక్ష్మ సేద్యానికి మరింతగా అనుసంధానం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఏపీఎంఐపీ కింద కర్షకులకు సంబంధించిన నాలుగు కీలక సేవలను 'మన మిత్ర' వాట్సప్ గవర్నెన్స్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.సాంకేతిక సేవలు రైతులకు సులభంగా చేరేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే పద్ధతులను క్షేత్రస్థాయిలో ప్రోత్సహించాలన్నారు. పంటలకు నీటి అవసరం, అందుబాటులో ఉన్న వనరులను బట్టి రైతులకు తగిన సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రకృతి సేద్యం వైపు అన్నదాతలను మళ్లించే కార్యాచరణను కూడా వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. హై రిస్క్ ప్రాంతాల్లో పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలిచ్చారు.విశాఖ తాగునీటి సరఫరాపై చంద్ర బాబు ప్రత్యేకంగా అధికారులతో చర్చించారు. నగరంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో అత్యవసర సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. బోర్లపై ఆధారపడే ప్రాంతాల్లో అవసరమైతే అదనంగా ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. విశాఖ సమీపంలోని రిజర్వాయర్లను నింపేందుకు యుద్ధప్రాతిపదికన చేపట్టగల పనులపై అవకాశాలను పరిశీలించాలని దిశానిర్దేశం చేశారు.మేఘాద్రిగడ్డకు పోలవరం ఎల్ఎంసీ నుంచి ప్యాకేజీ నంబర్ 8 కింద పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించే పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. విశాఖ నగరానికి మరో రెండు నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు సీఎంకు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు.ఖరీఫ్ సీజన్ 2026కు సంబంధించి ఏపీలోని 28 జిల్లాల్లో ప్రాథమిక అంచనా ప్రకారం 513 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఇందులో 268 మండలాల్లో పరిస్థితి తీవ్రంగా, 245 మండలాల్లో మోస్తరుగా ఉన్నట్లు తెలిపారు. కరవు పరిస్థితులపై వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనుంది. జిల్లా కలెక్టర్ల మార్గదర్శకత్వంలో క్షేత్రస్థాయి బృందాలు పంట నష్టం, దిగుబడి నష్టాన్ని పరిశీలించనున్నాయి. వ్యవసాయశాఖ క్షేత్ర పరిశీలన నివేదికను జిల్లా కలెక్టర్లకు సమర్పించనుంది. అనంతరం కరవు ప్రతిపాదనలను కలెక్టర్లు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖకు పంపించనున్నారు. ఈ ప్రతిపాదనలకు సెప్టెంబర్ 24ను తుది గడువుగా నిర్ణయించారు. సెప్టెంబర్ 29న రాష్ట్రస్థాయి కమిటీ కరవు ప్రతిపాదనలను పరిశీలించనుంది.కరవు మండలాల గుర్తింపు ప్రక్రియపై అధికారులతో జరిగిన సమీక్షలో ఆరు శాఖల నుంచి వచ్చే సమాచారాన్ని సమగ్రంగా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు అధికారులు చంద్రబాబుకు వివరించారు. వర్షపాతం, పంటల సాగు పరిస్థితి, భూగర్భ జలాలు, నేలలో తేమ శాతం, శాటిలైట్ చిత్రాలు, జలాశయాల్లో నీటి నిల్వలను విశ్లేషిస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో వర్షాభావంతో పాటు ఎల్‌నినో ప్రభావం ఉద్యాన పంటలపై ఉండే అవకాశం ఉందని వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్‌లోని 21 జిల్లాల్లో 1357 ఆర్ఎస్‌కేల పరిధిలోని పంటలను హై రిస్క్ కేటగిరీలో గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఎల్‌నినోతో 17,916 హెక్టార్లలోని నారింజ, బత్తాయి, మామిడి, ఎర్ర మిరప, ఉల్లి, కూరగాయల పంటలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని వివరించారు. ఈ క్రమంలో స్పందించిన చంద్రబాబు ఉద్యాన పంటలను కాపాడేందుకు ఇప్పటికే రూ.190 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

## నా జీవితం ధన్యమైంది విశాఖలో చంద్రబాబు ఎమోషనల్

మొదటిపేజీ తరువాయి - పట్టాలను చంద్రబాబు అందించారు. లబ్ధిదారులకు స్వయంగా పట్టాలు అందించి సుభాకాంక్షలు తెలియజేశారు. వేల మంది ప్రజలకు ఇంటిపై శాశ్వత హక్కు కల్పిస్తున్న ఈరోజు తన జీవితంలో మర్చిపోనని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నా జీవితం ధన్యమైంది, లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం చూస్తున్నా. 11 మండలాలకు చెందిన 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. మీరు ఉండే ఇళ్లపై సర్వహక్కులు ఇకనుంచి మీవే. పేదలకు పట్టాభిషేకం కార్యక్రమం ద్వారా ఇళ్లపై హక్కులు కల్పిస్తున్నాం. పేదలకు సొంతిళ్లు ఉండాలన్న ఎన్టీఆర్ స్ఫూర్తితోనే పని చేస్తున్నాం. సొంతిల్లు ఉండాలనేది, ప్రతి మనిషి కల. దశాబ్దాల కష్టాలు, అనిశ్చితికి నేటితో ముగింపు పలుకుతున్నాం. మీ ఇళ్లపై ఇకనుంచి వివాదం లేదు, ఎలాంటి భయం లేదు. మీ ఇళ్లపై ఇకనుంచి బ్యాంకు రుణాలు కూడా తీసుకోవచ్చు.రాజముద్ర వేసి మీకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. అభ్యంతరం లేని భూముల్లో పట్టాలు ఇస్తున్నాం. పేదలు స్వేచ్ఛగా బతకాలనే ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. ఇంకా 35 కాలనీల్లోని 10 వేల మంది పట్టాలు కోరుతున్నారు. దేవస్థానానికి చెందిన పంచగ్రామాల్లో 12,149 మందికి పట్టాలు ఇవ్వాలి. మిగతావారికి త్వరగా పట్టాలివ్వాలని అధికారులను ఆదేశిస్తున్నా. మీకు శాశ్వత చిరునామా కల్పించే బాధ్యత మా ప్రభుత్వానిది" అని సీఎం చంద్రబాబు తెలిపారు."దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందే నగరం విశాఖ. విశాఖ త్వరలో విశ్వనగరంగా మారుతుంది. మీరంతా గర్వంగా చెప్పుకునేలా విశాఖను మారుస్తున్నాం. అల్లూరి విమానాశ్రయం రాకతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చాయి. టూరిజం, లాజిస్టిక్స్ హబ్‌గా విశాఖ మారనుంది. పోలవరం ఎడమ కాలువ త్వరలో విశాఖకు వస్తుంది. చంద్రబాబు విశాఖకు హైవేలు, పోర్టులు, విమానాశ్రయాలు వచ్చాయి. ఈ రెండేళ్లలో విశాఖకు 91 ప్రాజెక్టులు వచ్చాయి. ఈ విశ్వనగరంలో ప్రతి పేదవాడికీ భాగస్వామ్యం ఉండాలన్న సీఎం చంద్రబాబు.

## కరవులో రైతాంగం.. దోపిడీలో కూటమి ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి - వదిలేసి రాష్ట్రాన్ని దోచుకోవడంలో నిమగ్నమయ్యారని ధ్వజమెత్తారు.గతంలో జగన్ అందించిన పారదర్శక సంక్షేమ పథకాల కంటే మిన్నగా పథకాలు ఇస్తామంటూ ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలు ఇప్పుడు ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ అశాస్త్రీయ విధానాలు, మోసపూరిత వైఖరిపై నియోజకవర్గాల వారీగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ఇప్పటికే పలు ప్రాంతాల్లో బాధితులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని గుర్తుచేశారు. ఈ ప్రజాగ్రహం నుంచి తప్పించుకునేందుకే కూటమి నాయకత్వం ప్రతిరోజూ కొత్త నాటకాలకు తెరలేపుతోందని, ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని పేర్ని నాని హెచ్చరించారు.ం

## వరంగల్ కొత్త ఎయిర్‌పోర్టుకు పేరు సూచించండి

మొదటిపేజీ తరువాయి - తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్ల కేటాయించడంతో పాటు అవసరమైన భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో కల రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు.ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు పెట్టుబడులకు కొత్త గేట్‌వే అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానించబడిన తెలంగాణ రాష్ట్రానికి కొత్త చిహ్నంగా నిలవనున్న వరంగల్ మామునూరు విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.రేవంత్ రెడ్డి ఇటీవల దిల్లీ వెళ్లిన సందర్భంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడితో భేటీ అయ్యారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటులో మిగిలిన పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులతో సమీక్ష చేశారు. పర్యావరణ అనుమతుల అంశం కూడా చర్చకు వచ్చింది. ఇప్పటికే ఏఏఐ అధికారులు సంబంధిత పత్రాలతో దరఖాస్తు సమర్పించిన నేపథ్యంలో త్వరగా ఆ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు.

## ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు

మొదటిపేజీ తరువాయి - ఇది ముమ్మాటికీ ప్రభుత్వ అసమర్థత వల్ల ఏర్పడిన కాంగ్రెస్ మార్క్ కరవు అని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాలు వినియోగంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు.శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ఈ ఏడాది శ్రీశైలం నుంచి 84 టీఎంసీల నీటిని వినియోగించుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పేర్కొనడం పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. వాస్తవానికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటివరకు కేవలం 8 టీఎంసీల నీటిని మాత్రమే మళ్లించారని ఆయన స్పష్టం చేశారు. కల్వకుర్తి పథకంలోని ఐదు మోటార్లలో కేవలం రెండే పని చేస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.గత మూడేళ్లలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ 718 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, తెలంగాణ కేవలం 216 టీఎంసీలకే పరిమితమై ఒదని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే అత్యంత తక్కువ స్థాయిలో కృష్ణా జలాలను వినియోగించుకోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు."నీళ్లు అందుబాటులో ఉన్నాయి, ఎత్తిపోసేందుకు మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ నీటిని మళ్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. అందుకే ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నా, తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండటం దారుణమని దుయ్యబట్టారు.

## 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు'

మొదటిపేజీ తరువాయి -
ద్వారా యువతను ఉద్దేశించి ప్రధాని ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా 51వేల మందికి నియామకపత్రాలు అందజేశారు.భారత్ ఇప్పటివరకు వివిధ దేశాలతో 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని ప్రధాని మోదీ తెలిపారు. వీటి ద్వారా భారత వ్యాపారులకు కొత్త భాగస్వామ్యాలు, కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అదే సమయంలో యువతకు కెరీర్‌లో కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయని పేర్కొన్నారు. భారత యువత నైపుణ్యాలు, ప్రతిభపై ప్రపంచ దేశాల్లో విశ్వాసం పెరుగుతోందని మోదీ అన్నారు. ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, యువత నుంచి ప్రపంచానికి భారీ అంచనాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ సేవల్లో చేరుతున్న యువత ప్రతి నిర్ణయంలోనూ దేశాన్ని అభివృద్ధి, స్వావలంబన దిశగా తీసుకెళ్లే ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. యువతకు ఇతర యువత పట్ల ప్రత్యేక బాధ్యత ఉందని చెప్పారు.ఇటీవల ముగిసిన బ్రిక్స్ సదస్సును ప్రధాని మోదీ ప్రస్తావించారు. బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకూడదని అన్నారు. భారత పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు, యువత కూడా ఈ భాగస్వామ్యంలో చురుకైన భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో దేశ యువత తమ నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.ప్రతి రంగంలోనూ శరవేగంగా మార్పులు జరుగుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. 'నిరంతరం నేర్చుకుంటూనే మీరు ఈ స్థాయికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి మళ్లీ కొత్త విషయాలు నేర్చుకునే సరికొత్త ప్రయాణం ప్రారంభమవుతుంది. మీరు ఎల్లప్పుడూ మీ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. కొత్త సాంకేతికతను, కొత్త వ్యవస్థలను అర్థం చేసుకోవాలి. 'మిషన్ కర్మయోగి'ఈ లక్ష్యాన్ని చేరుకోవటంలో మీకు సాయపడుతుంది. ప్రభుత్వం అసలైన బలం పౌరులకు దానిపై ఉన్న నమ్మకమే. ఆ నమ్మకం ఎలా వస్తుందంటే.. పౌరులకు ప్రభుత్వంతో ఎలాంటి అనుభవం ఎదురైందనే దాన్ని వల్ల వస్తుంది. ప్రభుత్వ సేవలో మన తారకమంత్రం ఒక్కటే కావాలి. 'నాగరిక్ దేవో భవ'. పౌరులకు సేవ చేయడమంటే దేశానికి సేవ చేయడమే. మీ పనితీరు వల్ల ఏ పౌరుడి జీవితమైనా సులభతరమైతే, అప్పుడే మీ విజయం మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటుంది' అని ప్రధాన మోదీ పేర్కొన్నారు.20వ రోజ్‌గార్ మేళాలో భాగంగా 51 వేల మందికి పైగా కొత్తగా నియమితులైన యువతకు నియామక పత్రాలు అందించారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులు రెవెన్యూ విభాగం, రైల్వేలు, హోం వ్యవహారాలు, ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు, రక్షణ తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో విధుల్లో చేరనున్నారు. ఈ 20వ రోజ్‌గార్ మేళాతో కలిపి ఇప్పటివరకు వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సుమారు 12.75 లక్షల మంది యువతకు నియామక పత్రాలు అందినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

## గచ్చిబౌలిలో ఒరిగిన నాలుగంతస్తుల భవనం కూల్చివేత

**గచ్చిబౌలి డివిజన్‌లోని ఎన్టీఆర్ నగర్‌లో అధికారులు భవనం కూల్చివేత చేపట్టారు**

**ప్రమాదకరంగా ఒరిగిన నాలుగంతస్తుల భవనం కూల్చి వేశారు**

**అక్రమంగా భవనాన్ని నిర్మించినట్లు అధికారులు గుర్తించారు**




హైదరాబాద్ గచ్చిబౌలి డివిజన్ గోపనపల్లి ఎన్టీఆర్ నగర్‌లో నాలుగంతస్తుల భవనం పక్కకు ఒరిగిన ఘటనలో అధికారులు చర్యలకు చేపట్టారు. స్థానికుల ఫిర్యాదుతో భవనం వద్దకు చేరుకున్న సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ - సీఎంసీ అధికారులు భవనాన్ని నేలమట్టం చేసేందుకు ఎన్టీఆర్ నగర్‌కు బాహుబలి క్రేన్‌ను తెప్పించి కూల్చివేతను చేపట్టారు. ఏ క్షణంలోనైనా బిల్డింగ్ కూలిపోయే ప్రమాదం ఉండటంతో భవనం చుట్టుపక్కల ప్రజలను ఖాళీ చేయించి కూల్చివేతను ప్రారంభించారు.అనుమతులు లేకుండా ఈ భవనాన్ని అక్రమంగా నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో తన భవనాన్ని కూల్చడం నిలిపివేయాలని భవన యజమాని లక్ష్మి, కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటి యజమానురాలైన లక్ష్మికి అప్పులు ఎక్కువ ఉండటంతో ఇటీవల దుబాయికి వెళ్లినట్లు తెలిపింది. అక్కడ ఇంటి పని మనిషిగా చేస్తూ డబ్బు సంపాదించేది.అధికారులు ఫోన్ కాల్ చేసి రమ్మని చెప్పడంతో తిరిగి తాను భారతదేశానికి వచ్చింది. వచ్చి చూసే సరికి భవనం కూల్చివేత చేపట్టారు. తనకు ఉండటానికి ఏమి లేదని, ఇల్లు కూల్చేస్తే తాను ఎక్కడ ఉండాలంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ఆ ఇంట్లో తన తల్లితో పాటు నివాసం ఉంటున్నట్లు తెలిపింది. భవనం కూల్చేస్తే తనకు ఇల్లు లేదని, న్యాయం చేయాలంటూ బోరున విలపించింది."భవనం కూల్చేస్తే ఉండటానికి ఏమి లేదు, నేను ఎక్కడ ఉండాలి. ఆ ఇంట్లో తల్లితో పాటు ఉంటున్నాను. అప్పులు ఎక్కువ ఉండటంతో దుబాయ్ వెళ్లి అక్కడ ఇంట్లో పనులో చేస్తూ డబ్బు సంపాదిస్తున్నాను. నాకు అధికారులు కాల్ చేసి రమ్మని చెప్పడంతో ఇక్కడికి వచ్చాను. తిరిగి వచ్చే చూసే సరికి ఇల్లు కూల్చేస్తున్నారు.భవన కూల్చివేత సందర్భంగా లక్ష్మి బంధువులు అడ్డుకునేందుకు ప్రయత్నించడం ఉద్రిక్తతకు దారితీసింది. ఓ దశలో వారు క్రేన్ వద్దకు వెళ్లడంతో హైడ్రా సిబ్బంది అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారమే కూల్చివేస్తున్నామని అధికారులు తెలిపారు. భవనానికి అనుమతి లేకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడం, అంతేకాకుండా కూలిపోయే పరిస్థితి ఉండటంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

## మోదీ, గడ్కరీలకు ధన్యవాదాలు తెలిపిన పవన్ కల్యాణ్




కడప జిల్లాలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ ను కడప బైపాస్‌తో అనుసంధానించే నూతన రహదారి నిర్మాణ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ ప్రాజెక్టు మంజూరుతో పాటు రూ. 304.44 కోట్ల నిధులను కేటాయించినట్లు కేంద్ర రహదారులు, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రధానమంత్రి మోదీకి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర మౌలిక వసతుల కల్పనకు, పారిశ్రామిక పురోగతికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అందిస్తున్న సహకారం అభినందనీయమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో (ఎజ×జ) కొప్పర్తి అత్యంత కీలకమైన నోడ్‌గా ఉందన్న ఆయన... కొత్తగా నిర్మించే అనుసంధాన రహదారి అందుబాటులోకి వస్తే పారిశ్రామిక సరుకు రవాణా మరింత వేగవంతం, సులభతరం అవుతుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ఫలితంగా రాయలసీమ ప్రాంతంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడటంతో పాటు, భారీ స్థాయిలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, వాణిజ్య కార్యకలాపాలు పెరిగి రాయలసీమ ముఖచిత్రం మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రేచపల్లి కార్యదర్శి పై చర్యలకు జాప్యం

## షోకాజు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్న అధికారులు...

## జిల్లా పంచాయతీరాజ్ శాఖ చర్యలపై మౌనం ఎందుకో....



**సారంగాపూర్, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 19:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామపంచాయతీలో పన్నుల సొమ్ముకు సంబంధించిన వ్యవహారంపై అధికారిక విచారణ జరిగి, షోకాజు నోటీసు జారీ చేసినప్పటికీ.. ఆ తర్వాత తీసుకున్న చర్యలపై స్పష్టత లేకపోవడం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ పనితీరుపై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. అధికారిక పత్రాల్లో పన్నుల వసూళ్లు, వాటిని సంబంధిత ఖాతాల్లో జమ చేయకపోవడం, వివరణ కోరడం వంటి అంశాలు నమోదు కాగా.."చర్యలు తీసుకుంటాం" అని నోటీసులో పేర్కొన్న అధికారులు, ఆ చర్యలను ఎప్పుడు అమలు చేస్తారన్నది మాత్రం ప్రశ్నార్థకంగా మారింది.

**విచారణ.... నోటీసు సరే.. మరి చర్యలు ఏవి.....?**

రేచపల్లి గ్రామపంచాయతీలో రూ.2,07,590/- పన్నుల రూపంలో వసూలైనట్లు అధికారిక పత్రాల్లో పేర్కొనబడింది. ఈ మొత్తానికి సంబంధించి విచారణ అనంతరం పంచాయతీ కార్యదర్శి ఆర్. సంతోష్ కు షోకాజు నోటీసు జారీ చేసి వివరణ కోరారు. అనంతరం రూ.66,166/- జమ చేసినట్లు, మిగిలిన రూ.1,36,691/-ను కూడా జమ చేస్తానని కార్యదర్శి సంజాయిషీలో పేర్కొన్నట్లు జిల్లా అధికారి కార్యాలయ పత్రాల్లో ఉంది. మిగిలిన మొత్తాన్ని ట్రెజరీలో జమ చేసి, చలాన్ల ప్రతులను ఏడు రోజుల్లో సమర్పించాలని ఆదేశాలు కూడా జారీ అయ్యాయి కానీ..ఇంతటి అధికారిక ప్రక్రియ జరిగిన తర్వాత కూడా సంబంధిత అధికారిపై తుది క్రమశిక్షణ చర్యలపై స్పష్టత లేకపోవడం ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

**డబ్బు జమ సరే..... శాఖ బాధ్యత సంగతేంటి.....?**

ప్రజల నుంచి వసూలైన పన్నుల సొమ్మును జమ చేయాలని ఆదేశించడం ఒక అంశం. కానీ నిధుల నిర్వహణలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారా.? విధుల్లో నిర్లక్ష్యం జరిగిందా.? బాధ్యత ఎవరిది.? అన్న అంశాలపై శాఖాపరమైన ప్రక్రియ ఉంటే దాని స్థితి ఏమిటో కూడా ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది. షోకాజు నోటీసు ఇచ్చి.. డబ్బు జమ చేయాలని ఆదేశించి.. ఆ తర్వాత వ్యవహారం ఏమైందో చెప్పకపోవడం జిల్లా పంచాయతీ శాఖ జవాబుదారీతనంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**జిల్లా పంచాయతీ అధికారి మౌనం..?**

జిల్లా పంచాయతీ అధికారి చికోటి మదన్ మోహన్ ఈ వ్యవహారంపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలను స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. రూ.1,36,691/- పూర్తిగా ట్రెజరీలో జమ అయ్యిందా.? చలాన్ల ప్రతులు సమర్పించారా.? షోకాజు నోటీసుపై వచ్చిన సంజాయిషీపై తుది నిర్ణయం ఏమిటి.? శాఖాపరమైన విచారణ కొనసాగుతోందా.? క్రమశిక్షణ చర్యలు ప్రారంభించారా.? చర్యలు ప్రారంభించి ఉంటే ప్రస్తుత స్థితి ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా కేవలం నోటీసులు, ఆదేశాలతో వ్యవహారాన్ని ముగిస్తే.. అధికారుల జవాబుదారీతనంపై మరింత అనుమానాలు వ్యక్తమయ్యే అవకాశం ఉంది.

**నిర్లక్ష్యానికి బాధ్యత ఎవరిది.....?**

ప్రజల నుంచి వసూలయ్యే పన్నుల సొమ్ము విషయంలో అధికారులు కేవలం రికార్డులు పరిశీలించడం, నోటీసులు జారీ చేయడంతో తమ బాధ్యత ముగిసిందని భావించకూడదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారిక విచారణ జరిగి, షోకాజు నోటీసు జారీ అయిన నేపథ్యంలో.. తదుపరి చర్యలపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత జిల్లా పంచాయతీ శాఖపై ఉంది. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ నిర్లక్ష్యానికి తెరదించి, రేచపల్లి పన్నుల వ్యవహారంపై పూర్తి వివరాలు ప్రజల ముందుంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## సారంగాపూర్ ఎస్ఐపై విచారణ షురూ

### విచారణ అధికారిని నియమించిన తెలంగాణ పోలీసు శాఖ



**సారంగాపూర్, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 19:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల ఎస్ఐ పాకాల గీతపై రేచపల్లి గ్రామ సర్పంచ్ బాస మహేష్ చేసిన ఫిర్యాదుపై తెలంగాణ పోలీసు శాఖ స్పందించింది. సర్పంచ్ సమర్పించిన ఫిర్యాదును డీజీపీ సమన్వయ విభాగం 080926/09441 నంబరుతో నమోదు చేసిన పోలీసు శాఖ.. ఫిర్యాదుపై విచారణ చేపట్టేందుకు ఈ నెల 18న విచారణ అధికారిని నియమించినట్లు సర్పంచ్‌కు ఫోన్ సందేశం ద్వారా సమాచారం అందింది. ఫిర్యాదుపై సమగ్రంగా విచారణ జరిపి, ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలతో కూడిన నివేదికను సమర్పించాల్సిందిగా సంబంధిత అధికారికి బాధ్యతలు అప్పగించినట్లు పోలీసు శాఖ తెలిపింది. ఎస్ఐపై సర్పంచ్ తన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై విచారణ అధికారి పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, వాస్తవాల ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు బాస మహేష్ కోరుతున్నారు. విచారణ అధికారిని నియమించడంతో ఫిర్యాదుపై తదుపరి ప్రక్రియకు మార్గం సుగమమైంది. అయితే విచారణ పూర్తయ్యే వరకు ఫిర్యాదులోని ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించరాదు. విచారణలో వెల్లడయ్యే అంశాలు, పోలీసు శాఖ సమర్పించే నివేదిక ఆధారంగానే తదుపరి పరిణామాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఇక విచారణ అధికారి ఏ అంశాలను పరిశీలించనున్నారు.? ఫిర్యాదులోని ఆరోపణలపై ఎలాంటి నివేదిక సమర్పించనున్నారు.? పోలీసు శాఖ తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోనుంది.? అన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

## సింహాచలం జగన్ కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు



**ఎండపెల్లి సెప్టెంబర్ 19 (ప్రజా మంటలు):** జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపెల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సింహాచలం జగన్ ఇటీవల ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయన కుటుంబ సభ్యులను జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పరామర్శించారు.జగన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. తక్షణ సహాయంగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాయికల్‌లో లో-వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

### రూ.30 లక్షలతో నాలుగు డీటీఆర్‌ల ఏర్పాటు



**రాయికల్, సెప్టెంబర్ 19 (ప్రజా మంటలు):** రాయికల్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న లో-వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.30 లక్షల వ్యయంతో నాలుగు డీటీఆర్‌లు ఏర్పాటు చేసినట్లు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. రాయికల్ మండలంలో ఈ పథకం అమలుకు సుమారు రూ.11.70 కోట్ల నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ల కోసం డీడీ చెల్లించిన వారికి విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. విద్యుత్ డిమాండ్ పెరిగినప్పటికీ వినియోగదారులకు నిరంతర సరఫరా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులకు ఉచిత విద్యుత్‌తో పాటు రుణమాఫీ, రైతుభరోసా వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా వారికి ఆర్థిక ప్రయోజనం కలుగుతోందన్నారు. రాయికల్ పట్టణ, మండల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. మైతాపూర్--రామాజీపేట బ్రిడ్జి పనులు పూర్తయ్యాయని, మిగిలిన అప్రోచ్ రోడ్డు పనులను కూడా పూర్తి చేస్తామని తెలిపారు.బోర్నపల్లి--రేచపల్లి--తాట్లవాయి ప్రాంతాలకు సంబంధించిన ఫారెస్ట్ క్లియరెన్స్ విషయంలో గత పాలకులపై ఎమ్మెల్యే ప్రశ్నలు సంధించారు. గతంలో మంజూరైన అభివృద్ధి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు..కార్యక్రమంలో కౌన్సిలర్లు, సర్పంచులు, రాయికల్ పట్టణ, మండల నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు

### - రూ.51 వేలు పలికిన లడ్డూ



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 19 ( ప్రజా మంటలు):** సికింద్రాబాద్ బోయగూడా లోని ఎంఎన్‌కే విట్టల్ సెంట్రల్ కోర్టు అపార్ట్‌మెంట్‌లో ఐదు రోజుల పాటు నిర్వహించిన వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా ముగిశాయి. మహిళలు, చిన్నారులు, అపార్ట్‌మెంట్ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.చివరి రోజు నిర్వహించిన లడ్డూ వేలం పాట భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వెన్న ఉమాశంకర్ నేతృత్వంలో ఉత్సాహంగా సాగిన ఈ వేలంలో డాక్టర్ ధనుంజయ్ దంపతులు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని రూ.51 వేలకు దక్కించుకున్నారు.అనంతరం జరిగిన గణపయ్య వీడ్కోలు కార్యక్రమంలో డాక్టర్ గంగోనే హనుమాన్లు, అలువాల నాగరాజు, హరికృష్ణ, పి.వి. కమలాకర్ రావు, నవీన్ దేవనాని, ప్రశాంత్ బగాడే, విజయ మన్నె, విగ్రహ దాతలు సబిత, రామ్‌రెడ్డి, లడ్డూ దాత వి. శ్రీనివాసన్, కె. మోహన్‌దాస్, రామేశ్వర్ రాళ్లబండి, కె.వి. రమణారావు, రమేష్, ఎన్. నీలకంఠమయ్య, రామచంద్రన్ తాళ్ల, బి. వెంకటేశ్వర్ రావు, సుధీర్, నాగేందర్ రాజ్, ప్రసాద్, వర్మ, రంగనాయకమ్మ, గాయత్రి, గంగోనే వనిత, శ్రీదేవి, ప్రమీల, లలిత, వంశీ, దిలీప్, అనిత తదితరులు పాల్గొన్నారు.

## మోండా మార్కెట్ గణనాథుడిని దర్శించుకున్న ప్రముఖ నిర్మాత దిల్ రాజు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 19 ( ప్రజా మంటలు):** సికింద్రాబాద్ మోండా మార్కెట్ పరిధిలోని టకారా బస్తీలో అశోక యువజన సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన మహా గణపతిని ప్రముఖ సినీ నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు దర్శించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ కుటుంబ సమేతంగా ఏర్పాటు చేసిన ఈ మండపానికి విచ్చేసిన ఆయన, గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం దిల్ రాజు మాట్లాడుతూ, పద్మారావు గౌడ్ ఏటా నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలు ఎంతో వైభవంగా, ప్రత్యేకంగా ఉంటూ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయని కొనియాడారు. ఇటువంటి విభిన్న వేడుకలు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల గంగా--జమునా తెహజీబ్ సంస్కృతికి, ఆచార వ్యవహారాలకు నిదర్శనమని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత తీగుళ్ల కిశోర్ కుమార్‌తో పాటు యువజన సంఘం ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జగిత్యలలో ఈనెల 23,24,25 తెదిలలో గణేష్ నిమజ్జనం



**జగిత్యాల సెప్టెంబర్ 19. (ప్రజా మంటలు):** మండప నిర్వాహకుల అభ్యర్థన మేరకు ఈ నెల 23, 24, 25 తేదీల్లో, అనంత చతుర్దశి రోజున కూడా సాయంత్రం వరకు గణేష్ నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని విశ్వహిందూ పరిషత్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్ కోరారు.ఈ సమావేశంలో వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ధార్మిక సంస్థలు, రాజకీయ వర్గాల ప్రతినిధులు, గణేష్ మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## చుక్క గంగారెడ్డి విజ్ఞప్తికి జిల్లా యంత్రాంగం స్పందన

### ప్రత్యేక సర్క్యులర్ జారీ చేసిన డిపివో

### జర్నలిస్టులను అనుమతించాలని ఆదేశాలు

### జి. పి. సమావేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు

### హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపిన ఉద్యమకారుడు




**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 19:** తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్, సామాజిక హక్కుల కార్యకర్త చుక్క గంగారెడ్డి ఈనెల 7న జగిత్యాల జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో సమర్పించిన విజ్ఞాపనపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి సెప్టెంబర్ 15న ప్రత్యేక సర్క్యులర్ జారీ చేసిన సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జగిత్యాల జిల్లాలోని ముగ్గురు డివిజనల్ పంచాయతీ అధికారులకు, 20 మంది మండల పంచాయతీ అధికారులకు, 385 గ్రామ పంచాయతీల కార్యదర్శులకు ఈ సర్క్యులర్ ప్రతుల ద్వారా ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పంచాయతీల్లో నిర్వహించే గ్రామ సభలు, పాలకవర్గ సమావేశాలు, ఇతర అధికారిక సమావేశాలకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ లను అనుమతించాలని ఆ సర్క్యులర్ లో పేర్కొన్నారు. పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సభలు, సమావేశాలు, అధికారిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సమావేశాల వివరాలు, మినిట్స్, తీర్మానాలను పకడ్బందీగా నమోదు చేయాలని ఆ సర్క్యులర్‌లో సూచించారు. తగు పోలీస్ భద్రతా ఏర్పాట్లు కూడా చేసుకోవాలని సూచించారు.అలాగే అవసరమైన చోట సిసిటీవి, ఆడియో వీడియో రికార్డింగ్, సమావేశాల నిర్వహణలో ప్రజలు, వార్డు సభ్యుల భద్రత, అనధికార వ్యక్తుల ప్రవేశ నియంత్రణ, పోలీస్ అధికారులతో సమన్వయం వంటి అంశాలపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. సమావేశాలకు సంబంధించిన రికార్డులను భద్రపరచడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో మీడియా ప్రతినిధులకు ప్రభుత్వ నిబంధనల మేరకు సహకరించాలని సూచించారు.ఈ మార్గదర్శకాలను గ్రామ పంచాయతీల స్థాయిలో అమలు చేసి, సంబంధిత నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించాలని మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.ప్రజా సమావేశాలు పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టడం పట్ల చుక్క గంగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రజా వాణిలో ఇచ్చిన విజ్ఞాపన పత్రం పై స్పందించి ప్రత్యేక సర్క్యులర్ జారీ చేయించిన జిల్లా కలెక్టర్ లకు, జిల్లా ఉన్నతాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గాంధీ మెడికల్ కాలేజీలో పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్ల రెన్యువల్ సంబరాలు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 19 (ప్రజా మంటలు):** సికింద్రాబాద్‌లోని ప్రతిష్టాత్మక గాంధీ మెడికల్ కళాశాలలో ఎండీ/ఎంఎస్ పీజీ, సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల రెన్యువల్ విజయవంతంగా పూర్తయింది. ఈ ఘనతపై కళాశాల అధ్యాపకులు, వైద్యవర్గాలు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు, అధికారులు కలిసి కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఇందిర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్, వైస్ ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ డా.నాగమోహనరావు, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాజారాం, టీజీజీడీఏ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ మాదల, టీజీజీడీఏ గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ అవుల మురళీధర్, డాక్టర్ సుధాకర్ బాబు, డాక్టర్ ఉమామహేశ్వర రాజు, డాక్టర్ సంగీత, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, సీట్ల రెన్యువల్ ప్రక్రియ విజయవంతం కావడానికి సమష్టిగా కృషిచేసిన ప్రిన్సిపాల్‌తో పాటు అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లోనూ అందరి సమన్వయంతో గాంధీ వైద్య కళాశాల నాణ్యమైన వైద్య విద్య, పరిశోధనలు, రోగుల సేవల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.

## మున్సిపల్ లో గణనాథునుకి ఉత్తర పూజలు



**జగిత్యాల, సెప్టెంబర్ 19 (ప్రజా మంటలు):** వినాయక నవరాత్రుల సందర్భంగా జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథునికి మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, కమిషనర్ సత్య ప్రణవ్, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్తర పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## విండ్సర్ అవెన్యూ అపార్ట్‌మెంట్‌లో ఘనంగా గణేష్ పూజలు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 19 (ప్రజా మంటలు):** సికింద్రాబాద్ బన్సీలాల్ పేట డివిజన్ న్యూ భోయిగూడ లోని విండ్సర్ అవెన్యూ అపార్ట్‌మెంట్‌లో వినాయక చవితి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కాలనీవాసులు ఏకతాటిపైకి వచ్చి బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు తమ ప్రతిభను కనబరిచారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ వేడుకల్లో అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.

## విద్యార్థుల" హాలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్స్" పంపిణి.



**మెట్టుపల్లి సెప్టెంబర్ 19 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ )** మెట్టుపల్లి మండల పరిధిలోని వెల్లుల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన "హాలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్స్" (సమగ్ర ప్రగతి పత్రం ) లను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేసిన ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థి కి చెందిన పాఠ్య, సహ పాఠ్య అంశాలు, ఆరోగ్య వివరాలు, సమగ్ర కార్యకలాపాలలో విద్యార్థి భాగస్వామ్యం నమోదు లతో పాటు,తల్లిదండ్రులుగా నా బిడ్డకు ఇంటివద్ద అందించే సహకారం, నా బిడ్డకు ఏ విషయం లో సహాయం అవసరం అనే విషయాల సమగ్ర సమాచార నమోదు లను తెలిపేవి ఈ హాలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్స్ అని తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రభుత్వం బాలికల కోసం సరఫరా చేసిన "శానిటరీ పాడ్స్ "ను కూడా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడే కొడంగల్ గడ్డపై కల్వకుంట్ల కవిత పాంచజన్య శంఖారావం



**కొడంగల్--కోస్గి సెప్టెంబర్ 19 (ప్రజా మంటలు):** తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కోస్గి కాలేజీ గ్రౌండ్‌లో పాంచజన్య సంకల్ప సభ నిర్వహించనున్నారు. సభకు పార్టీ నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు. 120 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పుతో సభా వేదికను ఏర్పాటు చేయగా, సుమారు 10 వేల మంది కూర్చునేలా సీటింగ్ ఏర్పాటు చేశారు.తెలంగాణ రక్షణ సేన ఏర్పాటు అనంతరం తొలిసారిగా కొడంగల్‌కు వస్తున్న కవితకు ఘన స్వాగతం పలికేందుకు నాయకులు కొడంగల్ నుంచి కోస్గి వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. కోస్గిలో పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం ఆమె సభా ప్రాంగణానికి చేరుకోనున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, తెలంగాణ ప్రయోజనాలు, కృష్ణా జలాల అంశం, వివిధ వర్గాల సమస్యలపై సభలో కవిత మాట్లాడనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు స్వీయ రాజకీయ శక్తి అవసరమని ఆమె వివరించనున్నట్లు పేర్కొన్నాయి.బహుజన తెలంగాణ సాధన, సబ్బండ వర్గాల అభివృద్ధి, సాధికారత కోసం తమ పార్టీ చేపట్టబోయే కార్యక్రమాలు, భవిష్యత్ రాజకీయ కార్యాచరణను కోస్గి సభ వేదికగా కవిత ప్రకటించనున్నట్లు పార్టీ నాయకులు వెల్లడించారు.

## జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా అమన్ జిత్ సింగ్



**కరీంనగర్, సెప్టెంబర్ 19 (ప్రజా మంటలు):** కరీంనగర్ పట్టణంలోని సిక్కు వాడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు అమన్ జిత్ సింగ్ను జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. చొప్పదండి ఎమ్మెల్యే, ఐజజ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం రేకుర్తి క్యాంపు కార్యాలయంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని మతాలు, వర్గాలకు సముచిత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. సిక్కు మైనార్టీల సమస్యల పరిష్కారానికి అమన్ జిత్ సింగ్ వారధిగా పనిచేయాలని ఆకాంక్షించారు. పార్టీ సంక్షేమ కార్యక్రమాలను అన్ని వర్గాల ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు అమన్ జిత్ సింగ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఆయన నియామకంపై కరీంనగర్ సిక్కు సమాజం, మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## భీమ్‌రాజ్‌పల్లిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకల పంపిణీ




**గొల్లపలి సెప్టెంబర్ 19 ప్రజా మంటలు :** చిన్నారుల విద్యా వికాసానికి, ఉజ్వల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా ప్రోత్సాహం అందించాలని లయన్స్ క్లబ్ పిలుపునిచ్చింది. మండల పరిధిలోని భీమ్‌రాజ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ మండల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ ఉప సర్పంచ్ బొమ్మన రాజమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం జాతీయ పోషణ మాసం సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పలకలు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మన కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ జ్యోతి మాట్లాడుతూ.. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. జాతీయ పోషణ మాసోత్సవాల సందర్భంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పోషకాహార విలువలపై అవగాహన కల్పిస్తున్నామని, లయన్స్ క్లబ్ వారు ముందుకు వచ్చి చిన్నారులకు పలకలు అందించడం ఎంతో అభినందనీయమని అన్నారు.అనంతరం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మన కుమార్ మాట్లాడుతూ.. నేటి చిన్నారులే రేపటి దేశ భవిష్యత్తు అని, ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు పౌష్టికాహారం అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే సేవా కార్యక్రమాల్లో భాగంగా పాఠ్య సామగ్రిని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకొని అంగన్‌వాడీ చిన్నారులు ఆరోగ్యవంతంగా ఎదగాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావంతో ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు కావ్య అంగన్‌వాడీ టీచర్ రెవెళ్ల రాజసులోచన,ఆయమ్మ కొలగాని అనిత,లయన్స్ క్లబ్ కార్యదర్శి మహంకాళి చంద్రశేఖర్, కోశాధికారి సట్ట సురేష్, పాస్ట్ ప్రెజెంట్ ముస్కు కరుణాకర్ రెడ్డి, కార్యదర్శి నరహరి, ఫీల్డ్ అసిస్టెంట్ బొమ్మ నరేందర్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా మంటలు

ఆదివారం 20 - 09 - 2026

# చిట్టీల పేరుతో భారీ మోసం రూ.కోట్లతో ఉడాయించిన దంపతులు

హైదరాబాద్ కూకట్‌పల్లి పరిధిలో అధిక వడ్డీల పేరుతో జరిగిన భారీ మోసం వెలుగుచూసింది. చిట్టీల పేరుతో ఓ దంపతులు భారీగా నగదు సేకరించారు. పెద్ద మొత్తంలో చేతికందగానే రాత్రికి రాత్రే పరారయ్యారు. వలస వచ్చి ఉన్నతంగా స్థిరపడ్డ దంపతులు కోట్లలో ఆస్తి ఉన్నా పేద, ధనిక అని సంబంధం లేకుండా స్థానికులందరితో ఆ ఇల్లాలు కలివిడిగా ఉండేది. కుమార్తె పెళ్లికి సైతం అందరిని ఆహ్వానించి ఖరీదైన బహుమతులిచ్చి తన పెద్ద మనసు చాటుకుంది. ఒకటి కాదు రెండు కాదు అందరితోనూ పదేళ్లకు పైగానే అనుబంధం ఉంది. ఏ చిన్న ఫంక్షన్ చేసినా స్థానికులందరితో కలిసి జరుపుకునేది. అలా ఎంతో నమ్మకంగా రెండు దశాబ్దాలుగా తమలో కలిసిపోయి జీవిస్తున్న ఆ దంపతులను అంతా గుడ్డిగా నమ్మారు. ప్రతిఫలంగా పోలీస్‌స్టేషన్ మెట్లెక్కారు. న్యాయం సత్వరమే జరగాలి అంటూ వారి ఇంటి ముందు ధర్నా చేపట్టారు. వారి నిరసనతో అక్కడి పరిస్థితి కాస్త ఉద్రిక్తంగా మారింది. అందరితో కలగొలుపుగా ఉన్న ఆ దంపతులు చేసిన తప్పేంటి వారిని నమ్మి ఎందుకు స్థానికులు పోలీస్‌స్టేషన్ మెట్లెక్కాల్సి వచ్చింది అసలేం జరిగిందిఇప్పుడు చూద్దాం.




**చిట్టీల పేరుతో భారీ మోసం**

భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న సొమ్మును అప్పగిస్తే ఏకంగా 28 ఏళ్ల పరిచయాన్ని, నమ్మకాన్ని ఆసరాగా చేసుకున్న దంపతులు కోట్ల రూపాయలకు కుచ్చుటోపీ పెట్టారు. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో అధిక వడ్డీలు, చిట్టీల పేరుతో ఆశ చూపి ఘరానా మోసానికి పాల్పడిన దంపతులు రాత్రికి రాత్రే ఉడాయించిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. బాధితులంతా మూకుమ్మడిగా ఆ మోసగాళ్ల ఇంటి ముందు ధర్నాకి దిగారు. 2దశాబ్దాలకు పైగా స్నేహం నటించి, చిట్టీల పేరుతో కొన్నిరోజులు అంతా సజావుగా సాగించిన దంపతులు పెద్ద మొత్తం చేతికందగానే తమ అసలు రూపాన్ని బయటకు తీశారు.ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కొనిజేడు గ్రామానికి చెందిన రమణారెడ్డి, సీతమ్మ దంపతులు దాదాపు 28 ఏళ్ల క్రితం హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డారు. కాలనీవాసులతో ఎంతో సన్నిహితంగా మెలుగుతూ కొంతకాలంగా ఇందిరానగర్, సాయిచరణ్ నగర్ నివాసితులతో పెద్ద ఎత్తున చిట్టీల వ్యాపారం నిర్వహించారు. ఇన్నేళ్లుగా నమ్మకంగా వ్యవహరించడంతో స్థానికులు తమ కష్టార్జితాన్ని, పిల్లల పెళ్లిళ్లు, భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న సొమ్మును వీరి వద్దే చిట్టీలు వేస్తూ వచ్చారు. బాధితులు తమ అత్యవసరాల నిమిత్తం డబ్బులు ఇవ్వాల్సిందిగా కోరగా సదరు దంపతులు రకరకాల కారణాలు చెబుతూ కాలయాపన చేశారు.

**పోలీసులను ఆశ్రయించిన బాధితులు**

కుమార్తె పెళ్లి కోసం కూడబెట్టుకున్న సొమ్ము ఇచ్చి ఒకరు, దంపతులను నమ్మి అప్పుగా ఇచ్చినవారు మరొకరు, భవిష్యత్ అవసరాల కోసం ఉపయోగపడతాయని ఇంకొకరు, అధిక వడ్డీ వస్తుందని ఆశతో ఇలా ఒక్కొక్కరు తమ కష్టార్జితాన్ని లక్షల్లో దంపతులకు ఇచ్చారు. ఇప్పుడు దారుణంగా మోసపోయి బోరుమంటున్నారు. ఆ దంపతులు కాజేసిన సొమ్ము దాదాపు 20 నుంచి 50 కోట్ల రూపాయలు ఉంటుందని బాధితులు చెబుతున్నారు. డబ్బులు అడిగితే కాలయాపన చేస్తున్న దంపతులను అనుమానంతో కొందరు నిలదీశారు. అప్పటికే పెద్దమొత్తంలో సొమ్ము చేతికందడంతో ఆగస్టు 25న నిందితులు ఇల్లు విడిచిపోయారు. బాధితులకు ఐపీ నోటీసులు పంపించడంతో వారంతా ఇంటికి వెళ్లి చూడగా తాళాలు వేసి ఉన్నాయి. తాము మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో దంపతుల కోసం గాలిస్తున్నారు.అప్పటి దాకా చిన్నమొత్తంతో వ్యవహారం బాగా నడిపించిన ఆ దంపతులు భారీ మొత్తంలో సొమ్ము ముట్టగానే తన దుర్బుద్ధిని చూపించారు. ఆడపిల్ల పెళ్లి విషయంలో తనని ఆపదలో ఆదుకున్న వారిని నట్టేట ముంచింది. ఎంత పరిచయస్తులైనా అనధికారిక వ్యక్తుల వద్ద,

# తెలంగాణపై ఎల్‌నినో ప్రభావం తాగునీటికి తొలి ప్రాధాన్యమిస్తున్నామని ప్రభుత్వం స్పష్టీకరణ

ఎల్‌నినోపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ జరిగింది. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొనేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంపై ఎల్‌నినో తీవ్రస్థాయిలో ప్రభావం చూపుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వర్షాలు లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని తెలిపారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా తాగునీటికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టంచేశారు. ఇలాంటి కీలక సమయంలో కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**ఎల్‌నినో ప్రభావంపై స్వల్పకాలిక చర్చ**

రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని అసెంబ్లీ వేదికగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఎల్‌నినోపై ప్రభుత్వం అసెంబ్లీలో సల్పకాలిక చర్చ చేపట్టింది. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి, దేశ వ్యవసాయ రంగానికి జీవనాధారమైన నైరుతి రుతుపవనాలపై ఎల్‌నినో ప్రభావం ఉందని చెప్పారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ఏ పంటలు వేస్తే బాగుంటుందో రైతులకు ముందుగానే తెలియజేశామన్నారు. వర్షాలు పడక శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో గతేడాది కంటే తక్కువ నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. కృష్ణా బేసిన్‌లో ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణే ఎక్కువ నీటిని వినియోగించుకుందని మంత్రి ఉత్తమ్ స్పష్టంచేశారు.

**సాగునీటి కంటే తాగునీటికి తొలి ప్రాధాన్యం**

ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా సాగునీటి కంటే తాగునీటికి ప్రభుత్వం తొలిప్రాధాన్యమిస్తోందని మంత్రి సీతక్క వెల్లడించారు. తాగునీటి అవసరాలు తీరాకే సాగుకు నీటిని విడిచిపెడుతున్నామన్నారు. అందుబాటులో ఉన్న 34 జలాశయాల్లో ఉన్న నీటిని తాగునీటి కోసం జాగ్రత్తగా వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉన్న తెలంగాణను కేంద్రం ఆదుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. విపత్కర పరిస్థితుల్లో రాజకీయాలు పక్కనబెట్టి, రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కరవు నివారణకు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ప్రతిదానికి ఎల్‌నినో పేరు అని చెప్పి తప్పించుకునేందుకు చూస్తోందని ఆక్షేపించారు.

**కేంద్రం చొరవ తీసుకోవాలి**



గత ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు దుబారా చేయకుండా మిగతా ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే, ఇప్పటికే తెలంగాణ సస్యశ్యామలంగా ఉండేదని మంత్రి ఉత్తమ్ స్పష్టంచేశారు. రాజకీయాలకు పోకుండా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ రిపేర్లు చేస్తున్నామన్న మంత్రి, వచ్చే వర్షాకాలం నాటికి వాటిని అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. తుమ్మిడిహెట్టి నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కోరారు.

# కల్తీనెయ్యి కేసులో కీలక పరిణామం కైలాష్‌చంద్ మాంగ్లా అరెస్ట్

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో కీలక వికెట్ పడింది. టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరాలో ముఖ్య పాత్ర పోషించిన కైలాష్ చంద్ మాంగ్లాను ఈడీ అరెస్ట్ చేసింది. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో కీలకపాత్ర పోషించిన కైలాష్‌చంద్ మాంగ్లాను హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల బృందం గురువారం అరెస్టు చేసింది. నిందితుడిని విశాఖలో ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతనికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఈ విషయాన్ని ఈడీ అధికారులు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. వైఎస్సార్సీపీ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి రూ. 230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని ఈడీ వెల్లడించింది.ఈ వ్యవహారంపై తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసును దర్యాప్తు చేసి, ఈ ఏడాది జనవరిలో నెల్లూరు ఏసీబీ కోర్టులో తుది ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. నిందితుడు మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో ఈడీ రంగప్రవేశం చేసింది. ఈ ఏడాది జూన్‌లో దేశవ్యాప్తంగా 15 ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. తాజాగా ఇదే కేసులో ఇప్పుడు ఈడీ అధికారులు కైలాష్‌చంద్ మంగ్లాను అరెస్టు చేశారు. అంతకుముందు భోలేబాబా ఓరోగానిక్ డెయిరీ డైరెక్టర్ విపిన్ జైన్‌ను అరెస్టు చేశారు.'అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్': సుకృతి ఫుడ్స్ ప్రైవేట్



లిమిటెడ్ ప్రమోటర్‌గా ఉన్న కైలాష్‌చంద్ మాంగ్లా, కల్తీ నెయ్యి తయారీలో కీలక పాత్ర పోషించారని ఈడీ పేర్కొంది. రిఫైన్డ్ పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, పామోలిన్, మోనోగ్లిజరైడ్స్, ఎసిటిక్ యాసిడ్ ఈస్టర్స్, ఎంజీ-90, మైవాసెట్ సాఫ్ట్ 400 వంటి రసాయనాలను ఉపయోగించి కల్తీ నెయ్యిని తయారు చేసి, ఆ తర్వాత టీటీడీకి సరఫరా చేశారు. దీన్ని 'అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్' నెయ్యిగా చలామణి చేశారు.2019-2024 మధ్య సుమారు రూ.230 కోట్ల విలువైన నెయ్యి సరఫరా చేయగా, ఇందులో దాదాపు రూ.96 కోట్ల విలువైన నెయ్యిని కైలాష్‌చంద్ మాంగ్లానే తయారుచేశారు. ఇందుకు తనకు చెందిన సుకృతి ఫుడ్స్ సంస్థనే ఆయన కేంద్రంగా చేసుకున్నారు. ఇలా తయారైన నెయ్యిని పునబాకలోని శ్రీ వైష్ణవి డైరీ స్పెషాలిటీస్, మల్‌గంగా మిల్క్ అండ్ ఆగ్రో ప్రొడక్ట్స్, ఏఆర్ డైయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి సంస్థల ద్వారా తిరుమలకు పంపారు. దాన్ని స్వచ్ఛమైన ఆవు నెయ్యిగా నమ్మించేందుకు తప్పుడు రికార్డులు, దొంగ రవాణా బిల్లులను నిందితుడు సృష్టించాడు. ఇతర కంపెనీలతో నెయ్యి కొనుగోలు చేసినట్లు, అమ్మకాలు జరిగినట్లుగా నకిలీ పత్రాలను సృష్టించాడని ఈడీ వెల్లడించింది.సయోధ్య కుదిర్చి: కల్తీనెయ్యి సరఫరాలో వివిధ డెయిరీల మధ్య సయోధ్య కుదిర్చేందుకు టీటీడీ అధికారులు, డెయిరీ నిపుణులకు లంచాలు ఇవ్వడంలోనూ కైలాష్‌చంద్ మాంగ్లా కీలకపాత్ర పోషించారు. సుకృతి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ప్రమోటర్‌గా పనిచేస్తున్నప్పుడు, భోలేబాబా ఆర్గానిక్ డెయిరీకి అధీకృత ప్రతినిధిగా కూడా వ్యవహరించారు. నెయ్యి టెండర్లు కట్టబెట్టేందుకు లంచం ఇవ్వాలని టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న కమీషన్ ఏజెంట్ పీపీ శ్రీనివాసన్‌ను సంప్రదించగా, అతను మాంగ్లాతో మాట్లాడాలని సూచించారు.తర్వాత భోలేబాబా డెయిరీ డైరెక్టర్ పోమిల్ జైన్‌ను దిల్లీలో ఉన్న చిన్నప్పన్న వద్దకు మాంగ్లానే తీసుకెళ్లారు. టీటీడీకి వైష్ణవి డెయిరీ కల్తీ నెయ్యి సరఫరా చేసే విషయంలోనూ కైలాష్‌చంద్ మాంగ్లా మధ్యవర్తిగా వహించారు. భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పోమిల్ జైన్, విపిన్ జైన్, డెయిరీ నిపుణుడు విజయభాస్కరరెడ్డితో కలిసి టీటీడీ టెండర్లలో పాల్గొనేలా వారిని ఒప్పించారు. ఈ మేరకు వాస్తవాలను సిట్ గతంలోనే నిర్ధారించింది.

# పోలీసులు కొట్టడంతోనే సాయికృష్ణ మృతి చెందాడు' ఏ4 సురేశ్ రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

సాయికృష్ణ కస్టడీ డెత్ కేసులో నిందితుడు సురేశ్ రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు వెలుగుచూశాయి. పోలీసులు కొట్టడంతోనే సాయికృష్ణ మృతి చెందాడని రిమాండ్ రిపోర్టులో వెల్లడైంది.గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో వెలుగులోకి కీలక విషయాలు విజయవాడలో తీవ్ర సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. డెత్ కేసులో నిందితుడు సురేశ్ రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు బయటపడ్డాయి. సుదీర్ఘకాలంగా పరారీలో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారి, ఏ-4 నిందితుడు గులివిందల సురేష్‌ను సిట్ అధికారులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. లుక్ అవుట్ సర్క్యులర్ జారీ కావడంతో న్యాయవాది సలహాతో నిన్న(గురువారం) సిట్ ఎదుట లొంగిపోయిన సురేష్‌ను విచారించిన పోలీసులు, అప్పటి కృష్ణలంక సీఐ నాగరాజు, ఇతర సిబ్బందితో కలిసి అతను పాల్పడిన దారుణాలను రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు.నిందితుడు సురేష్ రిమాండ్ రిపోర్టు ప్రకారం, " పోలీసులు కొట్టడంతోనే సాయికృష్ణ మృతి చెందాడు. మే 7న స్టేషన్‌లో విచారణ అనంతరం సాయికృష్ణను రాణిగారితోటలోని పాడుబడ్డ భవనానికి తరలించి తీవ్రంగా కొట్టడంతో మే 12న మృతిచెందాడు. విషయం బయటకు రాకుండా అర్ధరాత్రి బైక్‌పై మృతదేహాన్ని తరలించి స్వర్గపురి శ్మశానవాటికలో దహనం చేసి ఆధారాలు మాయం చేశారు." అని రిమాండ్ రిపోర్టు వెల్లడించారు. అంతేకాకుండా దాడికి సంబంధించిన డిజిటల్ ఫొటోలను డిలీట్ చేయడంతో పాటు, హైకోర్టులో వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను




ఉపసంహరించుకోవాలని బాధితుడి బంధువులను బెదిరించి ప్రలోభపెట్టారని సిట్ దర్యాప్తులో తేలింది.ఘటనా స్థలాల నుంచి ఎముకల శకలాలు, బైకులు, సీసీటీవీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్న సిట్ అధికారులు, నిందితుడు సాక్షులను ప్రభావితం చేయకుండా 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించాలని న్యాయస్థానాన్ని కోరారు. దీంతో న్యాయస్థానం సెప్టెంబర్ 24 వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. నిందితుడిని నూజివీడు జైలుకు పోలీసులు తరలించారు.అదృశ్యంలో కీలకంగా సురేష్ : సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో సిట్ ఎదుట సురేశ్(4) నిన్న(గురువారం) లొంగిపోయిన విషయం తెలిసిందే. సాయి కృష్ణ అదృశ్యంలో సురేష్ కీలకంగా ఉన్నాడు. అలాగే సీఐ నాగరాజుకు సురేశ్ అత్యంత సన్నిహితుడిగా ఉన్నారు. సాయి కృష్ణ కేసులో సురేశ్ పాత్ర ఉన్నట్లు నిర్ధారించిన సిట్ అధికారులు కేసు నమోదు చేశారు. సిట్ విచారణ సమయంలో సురేశ్ పరారీలో ఉన్నారు. తాజాగా గురువారం సిట్ కార్యాలయంలో సురేశ్ లొంగిపోయాడు.ఈ కేసులో ప్రధాన నిందితుడైన కృష్ణలంక మాజీ సీఐ నాగరాజుకు సురేశ్ అత్యంత సన్నిహితుడు. ప్రైవేట్ వ్యక్తి అయినప్పటికీ కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో అతను పెత్తనం సాగించేవాడని సిట్ దర్యాప్తులో తేలింది. సాయికృష్ణను అదుపులోకి తీసుకోవడం నుంచి అతడు మృతి చెందడం, అనంతరం శవాన్ని మాయం చేయడం వరకు అన్ని వ్యవహారాల్లో సీఐ నాగరాజుకు సురేశ్ సహకరించినట్లు తేలింది.పత్రికా ప్రకటన విడుదల : సురేశ్‌పై కేసు నమోదు చేయకముందే పలుమార్లు అతడిని పిలిపించి సిట్ కొంత సమాచారం సేకరించింది. పోలీస్‌స్టేషన్ నుంచి సాయికృష్ణను ఎందుకు బయటకు తీసుకెళ్లారు ఎవరు తీసుకెళ్లారు ఎక్కడెక్కడ తిప్పారు ఆ తర్వాత ఎప్పుడు స్టేషన్‌కు తీసుకొచ్చారు అనే వివరాలను అతని నుంచి రాబట్టారు. అయితే సురేశ్‌పై కేసు నమోదు చేసి ఏ4గా పేర్కొన్న తర్వాత నుంచి కనిపించడం లేదు.అనంతరం సురేశ్ ఆచూకీ కోసం సిట్ గాలించింది. అతడి ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని పత్రికా ప్రకటన విడుదల చేసింది. కేసు నమోదైన తర్వాత అతడు పరారీలో ఉన్నట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం గుర్తించింది. సురేశ్ గురించి ఆచూకీ తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సిట్ తెలిపింది. నిందితుడి వివరాలు తెలిసిన వాళ్లు 100/112 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని పేర్కొంది. తాజాగా గురువారం సిట్ ఎదుట 4 సురేశ్ లొంగిపోయారు. అనంతరం నిందితుడు సురేశ్ రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు బయటపడ్డాయి.

# కల్వర్ట్ ను ఢీకొట్టిన ఇన్నోవా కారు ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

బెంగళూరు హైదరాబాద్ జాతీయ రహదారిపై శంషాబాద్ వద్ద ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు అదుపుతప్పి కల్వర్ట్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై శంషాబాద్ వద్ద ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం చౌదూర్ గ్రామానికి చెందిన కేతావత్ లింబ్య, జమున, కేతావత్ మాన్‌సింగ్, వస్రామ్‌తో పాటు డ్రైవర్ ఆశోక్‌లు సొంతూరులో వినాయకుడికి పూజలు చేసి నగరానికి బయలుదేరారు.

**అదుపుతప్పి వేగంగా కల్వర్ట్‌లోకి**



బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై శంషాబాద్ మండలం పాలమాకుల వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు అదుపుతప్పి కల్వర్ట్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 48 కిలోల బంగారం, వజ్రాలు.. లీ చీ కా రాజా గణేశ్ ప్రచారంపై వీడిన మిస్టరీ

**హైదరాబాద్ 'గోల్డెన్ గణేశ్' ప్రచారం పూర్తిగా అవాస్తవమన్న పోలీసులు**

**బంగారు పూత, వజ్రాల అలంకరణ వాదనలను ఖండించిన వైనం**

**వ్యాపార ప్రచారం కోసమే నిర్వాహకులు తప్పుడు ప్రచారం చేశారని వెల్లడి**

**ఆధారం లేని వార్తలను షేర్ చేయవద్దని ప్రజలకు పోలీసుల సూచన**



బేగంబజార్ ఫీల్‌ఖానాలో కొలువుదీరిన 'లీ చీ కా రాజా గణేశ్--2026' విగ్రహంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని గోషామహల్ పోలీసులు స్పష్టం చేశారు. ఈ విగ్రహాన్ని 48 కిలోల పంచలోహాలతో తయారు చేసి, 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంతో పూత పూశారని, 3.8 లక్షల అమెరికన్ డైమండ్లతో అలంకరించారని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు.గణేశ్ నవరాత్రుల సందర్భంగా ఈ విగ్రహానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా చక్కర్లు కొట్టాయి. కొన్ని నివేదికలు దీని విలువ రూ.4 కోట్ల వరకు ఉంటుందని పేర్కొనడంతో ఈ వార్త మరింత వైరల్ అయింది.ఈ ప్రచారంపై లోతుగా విచారణ చేపట్టిన గోషామహల్ పోలీసులు అసలు వాస్తవాలను వెలుగులోకి తెచ్చారు. గోషామహల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వైరల్ సందేశాల్లో చెబుతున్నట్లుగా విగ్రహాన్ని బంగారం, వజ్రాలతో తయారు చేయలేదని నిర్ధారించారు. 'లీ చీ పెర్ల్స్ అండ్ జ్యువెల్స్' అనే తమ వ్యాపార సంస్థకు ఉచిత ప్రచారం కల్పించుకోవడం కోసం, ఆర్థిక లబ్ధి పొందే దురుద్దేశంతోనే ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఈ తప్పుడు ప్రచారానికి తెరలేపారని పోలీసులు తేల్చారు.అయితే, ఈ ఆరోపణలపై దుకాణ యజమాని ఆదర్ అగర్వాల్ స్పందిస్తూ తాము ఎలాంటి అతిశయోక్తి ప్రకటనలు చేయలేదని తెలిపారు. ఈ వైరల్ ప్రచారం వల్ల తమ కుటుంబానికి భద్రతాపరమైన సమస్యలు తలెత్తాయని, రక్షణ కల్పించాల్సిందిగా పోలీసులను ఆశ్రయించినట్లు ఆయన వివరించారు.ఈ నేపథ్యంలో, ప్రజలు ఎలాంటి ఆధారాలు లేని వార్తలను, ఫొటోలను గుడ్డిగా నమ్మవద్దని, ఇతరులకు షేర్ చేసి అనవసర గందరగోళం సృష్టించవద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు. గణేశ్ ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, అధికారికంగా ధ్రువీకరించిన సమాచారాన్నే విశ్వసించాలని సూచించారు.

# మద్యం షాపుల రెన్యూవల్ ప్రభుత్వ ఫీజు చెల్లించాల్సిందేనన్న హైకోర్టు

**మద్యం షాపుల రెన్యూవల్ ఫీజుపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు**

**ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు చెల్లించాల్సిందేనని స్పష్టీకరణ**

**తుది తీర్పుకు లోబడి ఫీజు ఉంటుందని తెలిపిన ధర్మాసనం**

**పిటిషనర్లు గెలిస్తే అదనపు మొత్తం సర్దుబాటు చేస్తామని ప్రభుత్వ హామీ**

**ఓపెన్, రిజర్వ్డ్ కేటగిరీల మధ్య ఫీజు వ్యత్యాసంపై యజమానుల పిటిషన్**




ఆంధ్రప్రదేశ్‌లో ఓపెన్ కేటగిరీ మద్యం దుకాణాల లైసెన్స్ పునరుద్ధరణ (రెన్యూవల్) రుసుము వివాదంపై హైకోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజును చెల్లించి, లైసెన్స్ రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని దుకాణ యజమానులను ఆదేశించింది. దరఖాస్తులకు సెప్టెంబర్ 21 ఆఖరి తేదీ కావడంతో ఈ ఉత్తర్వులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. రెన్యూవల్ ఫీజు తుది మొత్తం ఈ కేసులో వెలువడే తుది తీర్పునకు లోబడి ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఒకవేళ పిటిషనర్లు విజయం సాధిస్తే, వారు చెల్లించిన అదనపు మొత్తాన్ని భవిష్యత్ లావాదేవీలలో సర్దుబాటు చేస్తామని ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ కోర్టుకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ హామీని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ప్రస్తుతానికి నోటిఫై చేసిన ఫీజునే చెల్లించాలని సూచించింది.ఓపెన్ కేటగిరీ దుకాణాలకు, కల్లుగీత కేటగిరీ దుకాణాలకు మధ్య పునరుద్ధరణ ఎక్సైజ్ ట్యాక్స్ విధింపులో ప్రభుత్వం వ్యత్యాసం చూపడాన్ని సవాలు చేస్తూ గుంటూరుకు చెందిన పలువురు మద్యం వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నిబంధన వివక్షాపూరితమని, సంబంధిత జీవోలను రద్దు చేయాలని వారు కోరారు. వార్షిక ఆదాయంలో 38 శాతం రుసుముగా వసూలు చేస్తున్నారని పిటిషనర్లు వాదించారు.అయితే, లైసెన్స్ పునరుద్ధరణ అనేది పూర్తిగా స్వచ్ఛందమని, ఎవరినీ బలవంతం చేయడం లేదని అడ్వొకేట్ జనరల్ స్పష్టం చేశారు. 38 శాతం రుసుము అనేది వార్షిక ఆదాయంపై కాదని, గతంలో చెల్లించిన లైసెన్స్ ఫీజులో 38 శాతం మాత్రమేనని ఆయన వివరణ ఇచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# యువతకు తొలి ప్రాధాన్యం విజయసాయి రెడ్డి కొత్త పార్టీ ప్రకటన ఏకాదశి రోజునే



యువతకు తొలి ప్రాధాన్యత ఇచ్చేలా తమ పార్టీ ఉంటుందని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి చెప్పారు. విజయదశమి తరువాత ఏకాదశి రోజున తమ పార్టీ ప్రకటన చేస్తామని తెలిపారు. యువతకు తొలి ప్రాధాన్యత ఇచ్చేలా తమ పార్టీ ఉంటుందని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి చెప్పారు. అనంతపురంలో మీడియా సమావేశం నిర్వహించిన విజయసాయి రెడ్డి విజయదశమి తరువాత ఏకాదశి రోజున తమ పార్టీ ప్రకటన చేస్తామని తెలిపారు.ఒరిజినల్ రెడ్ల పౌరుషాన్ని కాపాడే పార్టీ : ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం విడిపోయాక రాయలసీమకు చెందిన వారే ఇద్దరు సీఎంలు అయ్యారన్నారు. రెండు కుటుంబ పార్టీలకు చెందిన సీఎంలు వారి 12 ఏళ్ల పాలనలో రాయలసీమకు ఒక్క సాగునీటి ప్రాజక్టు కూడా తీసుకరాలేకపోయారని విజయసాయి రెడ్డి అన్నారు. రాష్ట్రంలో 1200 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉందన్నారు. తాము అధికారంలోకి వస్తే దీన్ని 3500 టీఎంసీలకు పెంచడమే లక్ష్యమని, రాయలసీమకు మూడో వంతు నీరిస్తామన్నారు. తాను పెట్టబోయే పార్టీ ఒరిజినల్ రెడ్ల పౌరుషాన్ని కాపాడే పార్టీ అని, అన్ని కులాలు, మతాలను కలుపుకొని పోతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని నేటికీ భర్తీ చేయలేదని అన్నారు.అత్యధికంగా వలసలు రాయలసీమ యువత చంద్రబాబు, జగన్ మోహన్ రెడ్డిల కోసం రక్తం చిందిస్తామంటున్నారని, మీరు పుట్టిన గడ్డ కోసం పాటుపడాలని విజయసాయి రెడ్డి యువతకు చెప్పారు. అత్యధికంగా వలసలు వెళుతున్నది రాయలసీమ ప్రజలేనని, ఈ రెండు కుటుంబ పార్టీలు ఉన్నంత కాలం రాయలసీమ బాగుపడదని ఆయన విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఇరవై అంశాలతో ప్రజలకు మేలు జరిగేలా తాము ముందుకు పోతామని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లలో నాలుగు శాతం మతమార్పిడిలు పెరిగాయని, చర్చిలు విపరీతంగా నిర్మాణం చేశారని విజయసాయి రెడ్డి చెప్పారు." ఈ 12 సంవత్సరాలలో రాయలసీమకు నీటి ప్రాజెక్టులు ఏమైనా తీసుకొచ్చారా రాయల సీమ కేంద్రంగా మీరు అభివృద్ధి చేశారా ఈ రెండు కుటుంబాలకు రాయలసీమ పట్ల నిజమైన ప్రేమ ఉందా ఓట్ల కోసం మీకు రాయలసీమ కావాలి, రెడ్లు కావాలి. ఓట్ల కోసం మీరు ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తారు. మీకు రాయలసీమపై ప్రేమ లేదు అనే విషయాన్ని స్పష్టం చేస్తున్నా. రాయలసీమ గడ్డపై పుట్టిన వీరు రాయల సీమను పట్టించుకోకుండా వేరే ప్రాంతాల్లో ఆస్తులు కూడగట్టుకుంటున్నారు." - విజయసాయి రెడ్డి, మాజీ ఎంపీ

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com